

కలెక్టరేట్ ఎదురుగా ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

# వేతన వెతలు..

**ఆందోళనలు చేస్తున్నా..పట్టించుకోని ప్రభుత్వం**

**మూడు నెలలుగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు అందని జీతాలు**

రంగారెడ్డి, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : మూడు నెలలుగా వేతనాలు అందక అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు వేతనాల కోసం అల్లాడుతున్నారు. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన నాటి నుంచి వేతనాలు రావడం లేదు. బడ్జెట్ లేకపోవడం వల్లనే వేతనాలు నిలిచిపోయినట్లు తెలుస్తున్నది. ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసినా.. ధర్నాలు, నిరసనలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీలు వాపోతున్నారు.

**ఇబ్బందుల్లో ఉద్యోగులు..**

జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1600 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 1,380 మెయిన్ కేంద్రాలు కాగా.. 220 వరకు మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,828 మంది టీచర్లు, హెల్పర్లు పనిచేస్తున్నారు. గత డిసెంబర్ నెలతోపాటు ఈ ఏడాదికి సంబంధించి జనవరి, ఫిబ్రవరి మాసాల వేతనాలు నిలిచిపోయాయి. బడ్జెట్ సమస్యతోనే వేతనాలు నిలిచిపోయాయంటూ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఫైలు ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నదని, అది క్లియర్ అయితే వేతనాలు విడుదలవుతాయని పేర్కొంటున్నారు. అయితే ఎన్ని రోజుల్లో ఫైల్ క్లియర్ అయి వేతనాలు వస్తాయో! అన్నదానిపై అధికార వర్గాల వద్ద కూడా స్పష్టత లేదు. మొదటి తారీఖు మాట దేవుడెరుగు.. నెలనెలా రావాల్సిన వేతనాలే రావడంలేదని వాపోతున్నారు. జీతాలు లేక అప్పులు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గత ప్రభుత్వంలో ఠంచన్‌గా..**

అంగన్‌వాడీ ఉద్యోగుల పక్షపాతిగా కేసీఆర్ ప్రభుత్వం వారి వేతనాలను గణనీయంగా పెంచింది. ఏడేండ్ల కాలంలో మూడురెట్ల కంటే అధికంగా టీచర్లకు, మూడున్నర రెట్లు వేతనాన్ని మినీ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు పెంచారు. దీంతో టీచర్లకు గౌరవ వేతన రూపంలో రూ.13,650, హెల్పర్లకు రూ.7,800 చొప్పున కాస్త అటూ ఇటుగా.. నెలనెలా ఠంచన్‌గా గత ప్రభుత్వం అందిస్తూ వచ్చింది. కానీ.. కొత్త ప్రభుత్వంలో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చిందని ఉద్యోగులు వాపోతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు వేతనాల కోసం ధర్నాలు, నిరసనలు చేపట్టిన సందర్భాలు కోకొల్లలు. మళ్లీ ఇన్నాళ్లకు వేతనాల కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు రోడ్డెక్కే పరిస్థితులు వచ్చాయని ఆయా వర్గాలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నాయి.

# ఇంటర్ పరీక్షలకు 29 కేంద్రాలు

**జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్‌నాయక్**

వికారాబాద్, ఫిబ్రవరి 23 : తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఇంటర్ మొదటి సంవత్సరం ఈ నెల 28 నుంచి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం 29 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి ఎన్.శంకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 6447 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1352 మంది ఉన్నారని తెలిపారు. ఇంటర్ ద్వితీయ జనరల్ విద్యార్థులు 7689, ఒకేషనల్ విద్యార్థులు 1335 మంది ఈ పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో మొత్తం 7799 మంది, ద్వితీయ సంవత్సరంలో జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో మొత్తం 9024 మంది హాజరు కానున్నారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 29 థియరీ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పది పరీక్ష కేంద్రాలు, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో మూడు, మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలల్లో ఒకటి, మైనారిటీ వెల్ఫేర్ జూనియర్ కళాశాలల్లో ఒకటి, ప్రైవేట్ ఆన్ ఎయిడెడ్ కళాశాలల్లో 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రాజమోహన్, బుచ్చయ్య, వివిధ కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్స్, అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ మెంబర్స్, సిట్టింగ్ స్క్వాడ్ మెంబెర్స్, కస్టోడియన్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్‌నాయక్



యాచారం మండలం మేడిపల్లిలో ఎండిపోయిన సాలి చెరువు

# యాసంగి.. తలకిందులు

**చాలాకాలం తర్వాత రంగారెడ్డి జిల్లాలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. ఒట్టిపోయిన నీటి వనరులు.. కరెంట్ కోతలు.. బీటలు వారుతున్న పొలాలు.. రైతాంగానికి పాత రోజులను గుర్తుకు తెస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ పాలన రైతన్నల గుండెల నిండా భరోసా నింపగా.. ప్రస్తుతం రైతన్న గుండె కోతతో తల్లడిల్లుతున్నది. పెట్టుబడులకు డబ్బులు లేక అరకొరగా పంటలను సాగు చేసిన రైతన్నలు పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నమే చేయాల్సి వస్తున్నది. జిల్లాలో 2,170 చెరువులు ఉండగా.. చాలా వాటిల్లో నీటి మట్టాలు అడుగంటిపోయాయి. సాగు విస్తీర్ణం తగ్గి యాసంగి సాగు తలకిందులు కావడంతో రైతు కుటుంబాలు ఆందోళనతో గడుపుతున్నాయి. గడచిన పదేండ్ల కాలంలో ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ ఎదురుకాలేదని రైతాంగం పేర్కొంటున్నది.**

**అడుగంటుతున్న భూగర్భ జలాలు.. వట్టిపోతున్న చెరువులు**

- పంటలను రక్షించుకునేందుకు రైతన్నల భగీరథ ప్రయత్నాలు
- యాసంగి సాగుపై వర్షాభావ పరిస్థితుల ప్రభావం
- నేటికీ 60 వేల లోపు ఎకరాల్లోనే పంటల సాగు
- పదేండ్ల తర్వాత జిల్లాలో కరువు ఛాయలు

రంగారెడ్డి, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులతో సాగు నీటికి కటకట నెలకొన్నది. ఈ ఏడాది జులై, సెప్టెంబర్, అక్టోబర్ మాసాలలో వర్షాలు బాగానే కురిసినప్పటికీ అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో మాత్రం లోటు వర్షపాతం నమోదైంది. ఈ మూడు నెలల వ్యవధిలో మొత్తం 128.2మి.మీ.ల వర్షపాతం కురవాల్సి ఉండగా..23.7మి.మీ.లు మాత్రమే కురిసింది. మొత్తంగా 81.5మి.మి.ల లోటు వర్షపాతం నమోదైంది. గత యేడాది నవంబర్-డిసెంబర్ మధ్యకాలంలో 5.02 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు ఈ ఏడాది 8.2 మీటర్ల లోతులోకి పడి పోయాయి. జనవరి, ఫిబ్రవరి నెలల్లో జలాలు మరింత లోతుల్లోకి వెళ్లాయి. దీంతో బోర్లు, బావుల్లో నీటి మట్టాలు అడుగంటి గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. అడుగంటిన భూగర్భ జలాలతో బోర్లు సైతం ఆగిఆగి పోస్తుండడంతో పంటలకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు. చెరువులు, కుంటలపై ఆశలు పెట్టుకోగా..అవి సైతం రోజురోజుకూ అడుగంటుతుండడంతో రైతుల పరిస్థితి నిరాశజనకంగా ఉంది.

**పంటలను కాపాడుకునేదెలా !..**

గత యేడాది యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 1,23,239 ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేశారు. అయితే ఈసారి సాగుకు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ప్రస్తుత పరిస్థితుల్లో యాసంగి సీజన్‌లో 80వేల నుంచి లక్ష ఎకరాల్లోనే పంటలు సాగయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేస్తుండగా..ఆ మేరకు కూడా పంటలు సాగయ్యే పరిస్థితి కనిపించడం లేదు. సీజన్ ముగియనున్నప్పటికీ చాలా భూముల్లో రైతులు పంటలను సాగు చేయక పడావుగా ఉంచారు. ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 60వేల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. గత యాసంగిలో మండు వేసవిలోనూ చెరువులు, కుంటలు నిండు కుండల్లా ఉండి.. పచ్చని పంటలతో కళకళలాడిన పొలాలు నేడు కళ తప్పిపోయి కన్పిస్తున్నాయి.

**సాగునీటికి కష్టమొచ్చింది..**

ఈ ఏడాది వానలు లేక చెరువులు ఎండిపోయాయి. ఎండలు ఎక్కువగా కొడితే ఉన్న బోర్లు ఆపి పోస్తాయి. సాగునీటికి కష్ట కాలం తప్పేటట్టు లేదు. గతేడాది చెరువు, కుంటల్లో పుష్కలంగా నీళ్లున్నాయి. ఈసారి అవి మొత్తం ఎండిపోయాయి. కేసీఆర్ ఉన్నన్ని రోజులూ సాగునీటికి ఢోకాలేకుండే. పదేండ్లు చెరువుల్లో సరిపడా నీళ్లుండి ప్రతి వానకాలంలో మూడు, నాలుగు నెలలు చెరువులు అలుగులు దుంకేవి. పంటలు పుష్కలంగా పండేవి. కానీ ఈసారి నీళ్లు లేక పంటలు ఎండిపోతాయేమోనని భయంగా ఉన్నది. భూగర్భంలో నీళ్లు అడుగంటితే రైతులకు కన్నీళ్లు తప్పవు. రానున్న రోజుల్లో వానాలు రాకపోతే రైతుల బతుకులు ఆగమైతయ్. చెరువు కింద పొలమున్నప్పటికీ నీటికి కటకట మొదలైంది.

– కాశమల్ల సత్తయ్య, రైతు మేడిపల్లి



నందిగామ మండలం పిట్టలగూడ గ్రామంలో ఎండిపోయిన మరికుంట చెరువు



# అనుమతులుంటేనే.. గనుల తవ్వకాలు

**చిన్నతరహా ఖనిజాలకు పర్యావరణ అనుమతులు తప్పనిసరి**

- ఇకపై ఎర్రమట్టి, సుద్ద, నాపరాయి, పలుగురాయి, కంకర, గ్రానైట్‌లకు పర్యావరణ అనుమతులు ఉండాలి
- పర్యావరణ అనుమతి దరఖాస్తుకు మార్చి 31 వరకు గడువు
- అనుమతిపొందని మైనింగ్ సంస్థల పనులను నిలిపివేసేందుకు నిర్ణయం
- గనుల తవ్వకాలతో తాండూరు పరిసర ప్రాంతాల్లో పెరిగిన కాలుష్యం
- జిల్లావ్యాప్తంగా వెయ్యి హెక్టార్లలో ఆయా చిన్నతరహా ఖనిజాలు

వికారాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారిన గనుల తవ్వకాల అనుమతులు ఇకపై మరింత కఠినతరం కానున్నది. ఇప్పటి వరకు పెద్దతరహా గనులకు మాత్రమే పర్యావరణ అనుమతులు తప్పనిసరి అని ఉన్న నిబంధనను చిన్నతరహా ఖనిజాలకూ సంబంధిత నిబంధనను వర్తింపజేస్తూ నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు చిన్నతరహా ఖనిజాలకూ పర్యావరణ అనుమతులు తప్పక తీసుకునేలా అమలు చేసేందుకు జిల్లా మైనింగ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో దాదాపు అధిక మొత్తంలో చిన్నతరహా ఖనిజాలను తవ్వుతున్న మైనింగ్ యాజమాన్యాలు తప్పనిసరిగా పర్యావరణ అనుమతులు తీసుకోవాలని ఇప్పటికే సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తొలుత ఇసుకకే పరిమితమైన పర్యావరణ అనుమతులు, మైనింగ్ తవ్వకాలతో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం దృష్ట్యా పలువురు ఎన్జీవోలు సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ మేరకు సుప్రీం తొలుత పెద్దతరహా ఖనిజాలకు (సున్నపురాయి), తదనంతరం చిన్నతరహా ఖనిజాలకూ పర్యావరణ అనుమతులు ఉండాలని ఆదేశించడంతో అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో 200 చిన్నతరహా ఖనిజాలకు సంబంధించి మైనింగ్ లీజులు కొనసాగుతుండగా, ఒక్క సంస్థకూ పర్యావరణ అనుమతులు లేకపోవడం గమనార్హం. ఇప్పటికే లీజు తీసుకున్న మైనింగ్ సంస్థలకు పర్యావరణ అనుమతుల దరఖాస్తుకు ప్రభుత్వం మార్చి 31 వరకు గడువునిచ్చింది. గడువులోపు ఏదేని మైనింగ్ సంస్థ పర్యావరణ అనుమతి తీసుకోలేనట్లయితే మైనింగ్ శాఖ అధికారులతోపాటు రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి, అటవీ శాఖ అధికారుల బృందం పరిశీలించి పనులను నిలిపివేయనున్నారు.

**మార్చి 31 వరకు గడువు..**

చిన్నతరహా ఖనిజాల తవ్వకాలకు సంబంధించి పర్యావరణ అనుమతులు పొందేందుకుగాను మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశమిచ్చింది. ప్రస్తుతం లీజు కొనసాగుతున్న చిన్నతరహా ఖనిజ తవ్వకాల యాజమాన్యాలు తప్పనిసరిగా అనుమతి పొందాల్సిన అవసరం ఉన్నది. కొత్తగా లీజు పొందే వారితోపాటు ఇప్పటికే కొనసాగుతున్న లీజు సంస్థలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాల్సి ఉంటుంది. జిల్లాలో చిన్నతరహా ఖనిజాల్లో భాగంగా ఎర్రమట్టి, సుద్ద గనులు, నాపరాయి, పలుగురాయి, సెల్డ్‌స్పార్, కంకర, గ్రానైట్ తవ్వకాలు జరిపే వారంతా తప్పనిసరిగా పర్యావరణ అనుమతులు పొందాల్సిన అవసరముంది. అదేవిధంగా జిల్లాలోని పెద్దేముల్, మర్పల్లి, వికారాబాద్, పరిగి మండలాల్లో 610 హెక్టార్ల విస్తీర్ణంలో 40 ఎర్రమట్టి గనులు ఉన్నాయి. తాండూరు మండలంలో 100 హెక్టార్ల విస్తీర్ణంలో 160 నాపరాయి గనులు ఉన్నాయి. పెద్దేముల్, మర్పల్లి, ధారూరు మండలాల్లో 41 హెక్టార్ల విస్తీర్ణంలో 65 సుద్ద గనులు, వికారాబాద్, దోమ మండలాల్లో 86 హెక్టార్లలో 34 కంకర గనులు ఉన్నాయి. తాండూరు మండలంలో 12 హెక్టార్లలో 6 గ్రానైట్ గనులుండడంతోపాటు దోమ మండలంలో 76 హెక్టార్లలో 6 పలుగురాళ్ల గనులు ఉన్నాయి.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి..**

చిన్నతరహా ఖనిజ తవ్వకాలకు లీజు పొందిన వారంతా పర్యావరణ అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలి. మార్చి 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పర్యావరణ అనుమతులు లేని లీజు సంస్థల పనులు నిలిపివేస్తాం.

– జాకబ్, జిల్లా మైనింగ్ శాఖ ఏడీ

**కాలుష్యాన్ని పెంచుతున్న నాపరాళ్ల వ్యర్థాలు..**

తాండూరు పరిసరాల్లో వందల సంఖ్యలో ఉన్న నాపరాళ్ల పాలిషింగ్ యూనిట్లతో తాండూరు పట్టణంలో కాలుష్యం పెరిగిపోతున్నది. తాండూరు పట్టణ పరిసరాల్లో దాదాపు 800 పాలిషింగ్ యూనిట్లు ఉన్నాయి. ప్రతి రోజూ ఈ పాలిషింగ్ యూనిట్లలో కనీసం 400 లారీల (6 వేల టన్నుల ) నాపరాళ్లను పాలిష్ చేస్తున్నారు. వీటిని పాలిషింగ్ చేసే ముందుగా గనుల నుంచి తీసుకొచ్చిన నాపరాళ్ల పలుకలను తగిన సైజుల్లో కోత యంత్రాల సాయంతో కోస్తారు. దీంతో పెద్ద ఎత్తున వ్యర్థాలు మిగులుతాయి. ప్రతి పాలిషింగ్ యూనిట్‌లో కనీసం రోజుకు 5 టన్నుల నుంచి 10 టన్నుల వరకు వ్యర్థాలు వెలువడుతున్నాయి. దీంతో పట్టణ పరిధిలో ప్రతి రోజూ కనీసం 8 వేల నుంచి 10 వేల టన్నుల వరకు వ్యర్థాలను పారవేయడం ఆనవాయితీగా మారింది. వ్యర్థాలను ప్రధాన రోడ్ల ప్రక్కన పారబోస్తున్నారు. ట్రాక్టర్లలో నింపి రోడ్ల ప్రక్కన డంపింగ్ చేయడంతో రోడ్ల ప్రక్కన వ్యర్థాలు కుప్పలుగా పేరుకుంటున్నాయి. పాలిష్ చేసే సమయంలో ఇసుక పొడర్‌గా మారి సుద్ద రూపంలో బయటకు వస్తున్నది. ఇలాంటి వ్యర్థాలనూ పాలిషింగ్ యూనిట్ల వారు రోడ్ల ప్రక్కన వేస్తున్నారు. దీంతో రోడ్లపై వాహనాలు వెళ్లిన సమయంలో కాలుష్యం వెదజల్లుతున్నది. తాండూరు పట్టణంలో, పరిసరాల్లో నాపరాళ్ల వ్యర్థాలతో కాలుష్యం పెరుగకుండా చేయాలంటే ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. తాండూరు పట్టణ పరిసరాల్లో 15 నుంచి 20 కిలో మీటర్ల పరిధిలో వందల సంఖ్యలో పాలిషింగ్ యూనిట్లు, నాపరాళ్ల క్వారీలు, సుద్ద గనులు, ల్యాటరైట్ గనులు ఉండడంతో పట్టణం మీదుగా ప్రతి రోజూ 5 వేలకుపైగా లారీలు వస్తూ పోతుంటాయి. సిమెంట్ కర్మాగారాలకు ప్రతిరోజూ బొగ్గు, రాళ్లు, ల్యాటరైట్‌ను(ఎర్రమట్టిని) చేరవేసే లారీలు వందల సంఖ్యలో తిరుగుతుండడంతో పట్టణంలో కాలుష్యం మరింతగా పెరుగుతున్నది.

# జాగిలాలతో నేరాల నియంత్రణ

**23వ పోలీసుల జాగిలాల పాసింగ్ ఔట్‌లో రాష్ట్ర డీజీపీ రవిగుప్తా**

మొయినాబాద్, ఫిబ్రవరి 23 : జాగిలాలు అప్యాయతలకు.. విశ్వాసానికి ప్రతీక అని.. నేరాలను నియంత్రించడంలో జాగిలాల పాత్ర కీలకమని రాష్ట్ర డీజీపీ రవి గుప్తా అన్నారు. మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటలీజెన్స్ ట్రైనింగ్ అకాడమిలో ఏడాది పాటు శిక్షణ పొందుతున్న పోలీసుల జాగిలాల 23వ బ్యాచ్ పాసింగ్ ఔట్ శుక్రవారం ఉదయం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నో కేసుల్లో నేరస్తులను పట్టుకోవడంలో పోలీసులకు జాగిలాలు ఎంతో సహకరించాయని చెప్పారు. జాగిలాలు కనబర్చుతున్న ప్రతిభ , క్రమ శిక్షణ చూసి ఆశ్చర్యపోయానని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఐఐటీఏలో జాగిలాలకు అందిస్తున్న శిక్షణ ఏ రాష్ట్రంలో లేదన్నారు. ఇతర రాష్ట్రాల పోలీసుల అధికారులు తమ రాష్ట్ర జాగిలాలకు కూడా శిక్షణ ఇవ్వండి అని మన రాష్ట్ర ఐఐటీఏ అధికారులను కోరుతున్నారని చెప్పారు. ఇప్పటికే పలు రాష్ట్రాల జాగిలాలకు తెలంగాణ రాష్ట్రంలోని ఐఐటీఏలో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ఇంటలీజెన్స్ సెక్యూరిటీ వింగ్ సిబ్బంది ఉత్తమ ప్రతిభ కనబరస్తూ ఇటీవల జాతీయ స్థాయి డ్యూటీ మీట్‌లో పతకాలు సాధించారని చెప్పారు. తెలంగాణ పోలీసులు అత్యధిక పురస్కారాలు అందుకుంటున్నారని, దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారని తెలిపారు.

**జాగిలాలు ప్రశంసలు పొందుతున్నాయి..**

**– బి శివధర్‌రెడ్డి, ఇంటలీజెన్స్ అడిషనల్ డీజీపీ**

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఇంటలీజెన్స్ ట్రైనింగ్ అకాడమిలో పొందుతున్న జాగిలాలు ఉత్తమ ప్రతిభ కనబర్చి దేశంలోని ఇతర రాష్ట్రాల పోలీస్ శాఖల నుంచి ప్రశంసలు పొందుతున్నాయని ఇంటలీజెన్స్ అడిషనల్ డీజీపీ బి శివధర్‌రెడ్డి అన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఐఐటీఏ అధికారులు, సిబ్బంది ఎంతో ప్రగతిని సాధించిందన్నారు.

**771 జాగిలాలకు శిక్షణ ఇచ్చాం..**

**– తప్సీర్ ఇక్బాల్, ఇంటర్నెట్ సెక్యూరిటీ వింగ్ డీఐజీ**

మొయినాబాద్‌లోని ఐఐటీఏలో ఇప్పటి వరకు 771 జాగిలాలకు శిక్షణ ఇచ్చినట్లు ఇంటర్నెట్ సెక్యూరిటీ వింగ్ డిఐజీ తప్సీర్ ఇక్బాల్ తెలిపారు. బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన జాగిలాలకూ శిక్షణ ఇచ్చామన్నారు. ఏడాది పాటు 21 జాగిలాలకు, 28 మంది కనైన్ హ్యాండర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, 23వ బ్యాచ్‌లో పాసింగ్ ఔట్ చేసినట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన జాగిలాలకు, కనైన్‌ల హ్యాండర్లకు డీజీపీ బహుమతులను అందజేశారు. ఐఐటీఏలో నూతనంగా నిర్మించిన క్రికెట్ గ్రౌండ్‌ను డీపీజీ రవిగుప్తాతో పాటు ఐపీఎస్ అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఐజీపీ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రమేశ్, ఐపీఎస్ అధికారులు అరోనా సింగ్ ఠాకూర్, ఎస్ జెడ్ ఖాన్, భాస్కరన్, శ్రీనివాస్, ఐఐటీఏ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అరవిందరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీజీపీ రవిగుప్తా







జాగిలాల ప్రదర్శనలు